క్లుప్తంగా

మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం



మంత్రి మల్లారెడ్డితో ఎలక్ట్రికల్ ఫెడరేషన్ సభ్యులు

మేడ్చల్: రాష్ట్ర ఎలక్ట్రికల్ ఫెడరేషన్ సభ్యులు మంత్రి మల్లారెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభలకు రావాలని కోరుతూ ఆయనకు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌గౌడ్, విష్ణుచారి, ఫెడరేషన్ నాయకులు రవిశంకర్, బాలస్వామి, వెంకటేష్, కౌసర్, వినోద్, విద్యాసాగర్, వివేకానంద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్ పోటీలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్: అత్వెల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, స్పెల్ విజార్డ్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, రామారావు, స్కూల్ దత్తత యజమాని నందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్

మేడ్చల్: కుష్టువ్యాధి నివారణపై మండలంలోని గొడవెల్లి పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ లెప్రసీ ప్రోగ్రాం సందర్భంగా విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్, సీహెచ్ఓ మహాల, ఉప సర్పంచ్ పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



జవహర్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న సిబ్బంది

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్–357, 358లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను మంగళవారం రెవెన్యూ సిబ్బంది కూల్చి వేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించబోమన్నారు. కబ్జాదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శామీర్‌పేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దాసరి యెల్లుబాయి అధ్యక్షతన మంగళవారం మండల సమావేశ మందిరంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ మరమ్మతులకు రూ.3 లక్షలు, మండలంలో రూ.11.20 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. మండలంలోని సమస్యలపై ఎలాంటి చర్చ లేకుండానే సభను ముగించారు.

పదవీ విరమణ



మేడ్చల్ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న కండక్టర్ పీఎన్ రావు పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఎఫ్ జగదీశ్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

అందని బిల్లులు.. అప్పులే దిక్కు

- మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు సకాలంలో అందని బిల్లులు
- అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన
- పెంచిన గౌరవ వేతనాలు అందజేయాలని వంట కార్మికుల విజ్ఞప్తి
- గ్రేటర్‌తో సహా శివారు జిల్లాల్లో 2,497 పాఠశాలల్లో అమలవుతున్న పథకం



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందజేసే ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు మహిళా కార్మికులకు గౌరవ వేతనం రూ.3 వేలకు పెంచుతామని సర్కార్ ప్రకటించి పది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు హామీ నెరవేరలేదు. ఏళ్ల తరబడి పాఠశాలల్లో భోజనం వండి పెడుతున్న తమకు గిట్టుబాటు కావడం లేదని, కుటుంబాలు గడవడం కష్టంగా మారుతోందని నిర్వాహకులు వాపోతున్నారు.

3.64 లక్షల మందికి భోజనం..

గ్రేటర్‌తో సహా మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 2,497 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, వాటిల్లో 3,64,139 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 506 ప్రభుత్వ పాఠశాలల్లో 90,301 మంది విద్యార్థులు, రంగారెడ్డి జిల్లాలోని 1,301 ప్రభుత్వ పాఠశాలల్లో 1,65,202 మంది విద్యార్థులు, హైదరాబాద్ జిల్లాలోని 691 ప్రభుత్వ పాఠశాలల్లో 1,08,635 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరందరికీ మధ్యాహ్న భోజన పథకం వర్తిస్తోంది. ఆరు నుంచి ఎనిమిదవ తరగతి వరకు భోజనం వండిపెడుతున్న కార్మికులకు గతేడాది నవంబరు 22 వరకు బిల్లులు అందగా.. 9, 10 తరగతుల వారికి సెప్టెంబరు 22 వరకు వచ్చాయి. 6 నుంచి 8 తరగతుల ఏజెన్సీలకు రెండు నెలలు, 9 నుంచి 10 తరగతుల ఏజెన్సీలకు 5 నెలల బిల్లులు రావాల్సి ఉంది. బకాయిలతో కార్మికులకు వంటలు చేయడం భారంగా మారుతోంది. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం నెలకు రూ.3 వేల గౌరవ వేతనం కోసం వంట కార్మికులు ఆశతో ఎదురు చూస్తున్నారు. సర్కార్ ఇచ్చిన హామీ నెరవేర్చితే తమకు ఊరట లభిస్తుందని వారు చెబుతున్నారు.

రూ.వెయ్యితో గట్టెక్కేదెలా?

మధ్యాహ్న భోజన పథకం నిర్వహించేందుకు 2008 నుంచి వంట కార్మికులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఒక విద్యా సంవత్సరంలో పది నెలలకు గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. ప్రతినెలా బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.5.45, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు రూ.8.17, తొమ్మిది, పదో తరగతులకు రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు. గత జూన్ నుంచి గుడ్డు ధరను రూ.4 నుంచి రూ.5 పెంచినా మార్కెట్లో రూ.6 వరకు ఉండడంతో నిర్వాహకులు నష్టపోతున్నారు. నూనె, పప్పుల ధరలు పెరగడంతో తమపై ఆర్థిక భారం పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన వేతనాన్ని వెంటనే అమలు చేయాలి



ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనాన్ని వెంటనే అమలు చేయాలి. క్రమం తప్పకుండా బిల్లులు అందేలా చూడాలి. ముగ్గురం కలిసి పిల్లలకు భోజనం వండిపెడుతున్నాం. సరుకుల ధరలు బాగా పెరిగాయి. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో అప్పులు చేసి వంట సామగ్రి కొనుగోలు చేస్తున్నాం. పాత బాకీ చెల్లించడం లేదంటూ కిరాణా షాపు వారు సరుకులు ఇవ్వడం లేదు.

– జయమ్మ, మధ్యాహ్న భోజన కార్మికురాలు

త్వరలో చెల్లిస్తాం



క్రమంగా బిల్లుల బకాయిలు అందుతున్నాయి. డిసెంబర్ వరకు బిల్లులను ప్రభుత్వానికి నివేదించాం. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే బిల్లులను నేరుగా ఎంఈవోలకు అందిస్తున్నాం. మధ్యాహ్న భోజన కార్మికులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బిల్లులు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటాం.

– ఐ.విజయకుమారి, డీఈవో, మేడ్చల్ జిల్లా

లక్ష్యం దిశగా అడుగులు

- 'మన ఊరు–మన బడి' పథకంతో మారుతోన్న ప్రభుత్వ బడుల రూపు రేఖలు
- తొలి విడతలో ఎంపికైన పాఠశాలల్లో పూర్తయిన పనులు
- 25 స్కూల్స్‌లో పూర్తయిన పనులకు నేడు ప్రారంభోత్సవం
- హాజరు కానున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్సీ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పోచారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం

సాక్షి,మేడ్చల్ జిల్లా: సర్కారు బడుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'మన ఊరు–మన బడి' తొలి విడతలో ఎంపికైన 25 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. బుధవారం ఘట్‌కేసర్ మండలం పోచారం, మేడిపల్లి మండలం కమలానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవనాలను మంత్రి మల్లారెడ్డి ప్రారంభిస్తారు. బాచుపల్లి మండలం ప్రగతినగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే వివేకానందగౌడ్ ప్రారంభించనున్నారు. వీటితో పాటు మరమ్మతులు పూర్తయిన మరో 22 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను వారం రోజుల వ్యవధిలో ప్రారంభించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయకుమారి పేర్కొన్నారు. ఇన్నాళ్లు కళావిహీనంగా ఉన్న విద్యాలయాలు కొత్త శోభను సంతరించుకోనుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి జిల్లాలోని మిగతా 51 ప్రభుత్వ పాఠశాలల భవనాల మరమ్మతులు ,అదనపు గదుల నిర్మాణంతో సహా అన్ని పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

మొదటి విడతలో 176 పాఠశాలలు ఎంపిక

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 505 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 375, యూపీఎస్‌లు 22, ఉన్నత పాఠశాలలు 108 ఉన్నాయి. ఈ ప్రభుత్వ బడుల్లో 96,012 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మన ఊరు–మన బడి కింద మొదటి విడతలో 176 ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ ఎంపిక చేయగా, ఇందులో 106 ప్రాథమిక పాఠశాలలు, 6 యూపీఎస్‌లు, 61 హైస్కూల్స్ ఉన్నాయి. ఈ బడుల్లో ఇప్పటికే ఇంగ్లిష్ మీడియం విద్య ప్రారంభించారు.

రూ.70 కోట్ల నిధులతో పనులు..

మన ఊరు–మన బడి కింద ఎంపికైన పాఠశాలల్లో 12 రకాల సమస్యలను గుర్తించిన యంత్రాంగం రూ.70 కోట్ల నిధులతో పనులకు ప్రణాళిక రూపొందించింది. మరుగుదొడ్లు, ప్రహరీలు, వంట గదులు, భోజన శాలలు వంటి నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేర్చగా, భవనం మరమ్మతులు వంటి వాటి కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గ, జిల్లా అభివృద్ధి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. నీటి వసతి తదితర మౌలిక వసతులు, స్థానిక అవసరాల కోసం సైతం నిధులు కేటాయించారు. మొదటగా ప్రభుత్వం రూ.10 కోట్లు విడుదల చేయడంతో జిల్లాలోని 8 మండలాల పరిధిలో 25 ప్రభుత్వ బడుల్లో మరమ్మతులు పూర్తి చేశారు. పాఠశాలల్లో సీలింగ్ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లను అమర్చారు. వంట, తరగతి గదుల్లో పగుళ్లు ఉంటే పూడ్చారు. పాఠశాలల్లో తరగతి గదుల లోపల, వెలుపల, భవనం, మరుగుదొడ్లు ఇలా ఆవరణ మొత్తం రంగులు వేసి అందమైన చిత్రాలు, పాఠ్యాంశాల్లోని పటాలు, చారిత్రక కట్టడాలు, గ్రామీణ, పట్టణ జీవనం ప్రతిబింబించే బొమ్మలు గోడలపై వేయించారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోండి



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న కమిషనర్ వేమనరెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు–2ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్ పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ వేమనరెడ్డి సూచించారు. ఎన్ఎఫ్‌సీనగర్ కమ్యూనిటీహాల్‌లో 3వ వార్డులో చివరి రోజు నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం వారు సందర్శించారు. అంధరహిత తెలంగాణ కోసమే ప్రభుత్వం కంటి వెలుగును ప్రవేశపెట్టిందని వారు అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సంగీత, వెంకట్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, ప్రవీణ్‌రెడ్డి, బాల్‌రాజ్, రమేష్, లింగస్వామి, డాక్టర్ ఫణిందర్‌రెడ్డి, పీహెచ్ఎన్ విమల రెడ్డి, ఆప్తమాలజిస్ట్ విమల, డీఈఓ సాత్విక్, విజయ, రాజేశ్వరీ, ఆశా వర్కర్లు లక్ష్మి, మేఘమాల పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. రాజబొల్లారం, శ్రీరంగవరం, డబిల్‌పూర్ గ్రామాల్లో చేపట్టిన కంటి వెలుగు శిబిరాల్లో గ్రామస్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు కోరారు.

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: గ్రామంలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అవుషాపూర్ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి గౌతమి అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో ఉప సర్పంచ్ ఐలయ్య యాదవ్‌తో కలిసి అభివృద్ధిపై పనులపై చర్చించారు. ఈ సందర్భంగా డ్రైనేజీలు శుభ్రం చేసేందుకు బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ కొనుగోలు చేయాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని నిర్ణయించారు. అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామంలో బుధవారం కంటి వెలుగు–2 ప్రారంభం కానుందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కావేరి సూచించారు. సమావేశంలో వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



స్థానికులతో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలోని 9వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యురాలు మీనా, రమేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, హనుమాన్ పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ గండి రాంచందర్

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌ను సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ గండి రాంచందర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మార్వాడీలైన్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షల వ్యయంతో చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పనులకు రాంచందర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి సహకారంతో డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. ఇప్పటికే చాలా కాలనీల్లో అంతర్గత డ్రైనేజీ, సీసీ రోడ్లు వేశామన్నారు. కార్యక్రమంలో ఆకాశ్, మమత, అమృత, మౌనిక, వాసవి, ధనలక్ష్మి, చంద్రమణి, స్వరూప, వెంకట్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జవహర్‌నగర్: యువతి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాప్రాల్‌కు చెందిన సంతోష్‌కుమార్ కుమార్తె ఆకాంక్ష శ్రీవాస్తవ (17) ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. మంగళవారం ఉదయం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు కళాశాల వద్ద, తెలిసిన వారి వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తయిన పనులకు నేడు ప్రారంభోత్సవం

పోచారం: మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పూర్తయిన అభివృద్ధి పనులను కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. పోచారంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ సురేష్ తెలిపారు.

'మిషన్ భగీరథ పేరుకే పరిమితమైంది'



చౌదరిగూడలో స్థానికుల సమస్యలు వింటున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, అధికారులు

ఘట్‌కేసర్: మిషన్ భగీరథ పేరుకే పరిమితమైందని, ఓఆర్ఆర్ లోపలి గ్రామాల్లో తాగునీటి సరఫరాకు పైపులైన్ లేదని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌదరిగూడలో మిషన్ భగీరథ డీఈ నిర్మల, ఏఈ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ రమాదేవితో కలిసి మంగళవారం వెంకటసాయి నగర్, డాక్టర్స్ కాలనీ, కాకతీయ నగర్ కాలనీల్లో పర్యటించారు. తాగునీటి సరఫరా గురించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక మంత్రి నిర్లక్ష్యంతోనే భగీరథ నీరు సరఫరా కావడం లేదని, మేడ్చల్ జిల్లాలో నీటి బిల్లుల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తూ పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. 50 కాలనీల్లో తాగునీరు రావడం లేదని, పైపులైన్ ఉన్నప్పటికీ కనెక్షన్ ఇవ్వడం లేదని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పేదలకు నీటి సరఫరా చేసి ఆదుకోవాలని డీఈ నిర్మలకు సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌతమి, వార్డు సభ్యుడు సుధాకర్, ఎంపీటీసీ శోభారాణి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్వాసం కోల్పోయినట్టేనా..?



అడిషనల్ కలెక్టర్ అగస్త్యకు నోటీస్ అందజేసిన కౌన్సిలర్లు

- మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు
- కుర్చీ కోసం కాంగ్రెస్‌తో దోస్తీ కట్టిన బీఆర్ఎస్ అసమ్మతి వర్గం

మేడ్చల్: మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డిపై అధికార బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు ఇవ్వడంతో మేడ్చల్ రాజకీయం వేడెక్కింది. ఇనాళ్లు బీఆర్ఎస్‌కు చెందిన 16 మంది కౌన్సిలర్లు అసమ్మతి గ్రూపుగా ఉన్నారు. అయితే మంత్రి మల్లారెడ్డి తమ కౌన్సిలర్లు గడప దాటకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో సోమవారం రాత్రి వరకు అసమ్మతి గ్రూపులోని 6 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్‌కు మద్దతుగా నిలిచారు. అసమ్మతి గ్రూపులో 10 మంది మిగలడంతో వారు ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లను కలుపుకుని మంగళవారం అవిశ్వాసం నోటీసు అందజేశారు.

మారిన రాజకీయం..

బీఆర్ఎస్‌కు చెందిన 16 మంది కౌన్సిలర్లు తిరుగుబాటు ఎగురవేసినప్పటికీ మానస, గణేష్, ఉమా, ఎఎస్ఆర్, దేవ, సాయికుమార్ అసమ్మతి గ్రూపు నుంచి బయటకు రావడంతో రాజకీయం పూర్తిగా మారిపోయింది. అసమ్మతి గ్రూపులోకి కాంగ్రెస్‌కు చెందిన భవాని, చాపరాజు చేరడంతో వారి బలం 12కు చేరింది. అందులో మరో ఇద్దరు అవిశ్వాసం నోటీస్ ఇచ్చే సమయంలో దూరంగా ఉన్నారు. 12 మంది నోటీసు ఇవ్వడానికి అవసరం కావడంతో అసమ్మతి నాయకులు బీఆర్ఎస్ చెందిన అర్చన, కృష్ణవేణి, మాధవి, ప్రియాంక, వైస్ చైర్మన్ రమేష్, కాంగ్రెస్‌కు చెందిన భవాని, చాపరాజుతో కలిసి నోటీసులు అందజేశారు. నోటీసులో సంతకాలు ఉన్న మానస, హరికృష్ణయాదవ్, మహేష్, దేవ, నర్సింహస్వామి యాదవ్, మణికంఠగౌడ్, సాయికుమార్ నోటీసులు ఇవ్వడానికి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లలేదు. దీంతో వీరంతా ఎటు వైపు ఉన్నారో అర్థం కాని పరిస్థితి నెలకొం. మంత్రి మాటకు కట్టుబడి ఉన్నామని కొంతమంది చెబుతున్నా తటస్థంగా ఉండి చైర్మన్ వైపు ఉండాలని తీర్మానం చేసుకున్నట్లు తెలుస్తోంది. చైర్ పర్సన్ భర్త నర్సింహారెడ్డి చాకచక్యంగా వ్యవహరించి మంత్రి మల్లారెడ్డి అండదండలతో ఆరు మందిని తన వైపు తిప్పుకోగలిగినా అవిశ్వాసం నోటీసులు ఇవ్వడంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది.

మొదలైన ప్రలోభాలు..

తమకు మద్దతుగా ఉన్న కౌన్సిలర్లు జారిపోకుండా నేతలు తాయిలాల ప్రలోభాలు మొదలు పెట్టారు. చైర్ పర్సన్ వైపు తాజాగా 9 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా, అసమ్మతి గ్రూపులో కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి 10 మంది ఉన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్ సరిత, బీజేపీ కౌన్సిలర్ లావణ్య తటస్థంగా ఉన్నారు. చైర్ పర్సన్ పదవి ఆశిస్తున్న నేతలు తమకు మద్దతుగా ఉన్న కౌన్సిలర్లకు తాయిలాలు అందజేస్తున్నట్లు సమాచారం.

అవిశ్వాసం వస్తే ఎదుర్కొంటాం

కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. అవిశ్వాసం వస్తే మంత్రి మల్లారెడ్డి సూచనలతో ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం. న్యాయపోరాటం చేయడానికైనా సిద్ధంగా ఉన్నాం.

– దీపిక నర్సింహారెడ్డి, చైర్ పర్సన్

మా బలం చూపిస్తాం

అవిశ్వాసం నోటీసులు ఇచ్చాం. తీర్మానం ప్రవేశపెట్టేందుకు సమావేశం ఏర్పాటు చేస్తే మా బలం చూపిస్తాం. అవసరమైన సంఖ్యా బలం మాకు ఉంది. మేడ్చల్‌ను అభివృద్ధి చేయాలని, అవినీతిని అంతమొందించాలనే ఉద్దేశంతోనే అవిశ్వాస తీర్మాణ నోటీసులు ఇచ్చాం.

– అసమ్మతి కౌన్సిలర్లు

అవిశ్వాసానికి రె'ఢీ'

- అవిశ్వాసంపై ధీమా వ్యక్తం చేస్తున్న ఇరు వర్గాలు
- క్యాంప్‌లో భాగంగా బాపట్ల వెళ్లిన అసమ్మతి కార్పొరేటర్లు
- మంత్రి మల్లారెడ్డిపై ఆశలు పెట్టుకున్న మేయర్ వర్గం
- ఎవరి మాట వినేదేలే అంటున్న అసమ్మతి గ్రూప్



జవహర్‌నగర్: కార్పొరేషన్‌లో అవిశ్వాసం ఉన్నా లేకున్నా తాము ఏ మాత్రం తగ్గేది లేదని ఇరువర్గాలు అంటున్నాయి. నాలుగు రోజుల క్రితం జవహర్‌నగర్ మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు 20 మంది కార్పొరేటర్లు సంతకాలతో కూడిన అవిశ్వాసపత్రం అందజేశారు. అనంతరం వారంతా బస్సులో క్యాంప్‌నకు తరలివెళ్లారు. మంత్రి మల్లారెడ్డిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఒక్కసారిగా 20 మంది కార్పొరేటర్లు క్యాంపునకు వెళ్లడంతో మేయర్ వర్గం ఉలిక్కిపడింది. దీంతో మంత్రి ఇంటికి వెళ్లి కార్పొరేషన్‌లో జరుగుతున్న పరిస్థితులపై మేయర్ వివరించారు. తాను మేయర్ పీఠం ఎక్కిన నాటి నుంచి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ తమ ఆదేశాలను నిరంతరం పాటిస్తున్నాని మంత్రితో ఆమె అన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే కొందరు పనికట్టుకుని మేయర్ పీఠం కోసం ఆశపడుతూ హడావిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విషయంలో చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు.

ఆత్మగౌరవం కోసమే అవిశ్వాసం..

ఎలాంటి రాజకీయ అనుభవం లేకున్నా మంత్రి మల్లారెడ్డి సూచనల మేరకు మేయర్‌గా మేకల కావ్యకు మద్దతిచ్చామని అసమ్మతి కార్పొరేటర్లు చెబుతున్నారు. అప్పటి నుంచి ఆమె కేవలం తన తండ్రి మేకల అయ్యప్ప అడుగులజాడల్లో నడుస్తూ కార్పొరేటర్లను అడుగడుగునా అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌లో ఆమె కుటుంబ సభ్యుల పెత్తనం చెలాయిస్తున్నా మూడేళ్లు భరించామని, ఈ విషయాన్ని పలుమార్లు మంత్రి మల్లారెడ్డి, మేయర్ కావ్య దృష్టికి తీసుకెళ్లినా వారి వ్యవహారశైలిలో ఎలాంటి మార్పులేదన్నారు. ఇక మీదట గౌరవం లేని చోట ఉండలేమని కార్పొరేటర్లకు సరైన గౌరవం కల్పిస్తూ కార్పొరేషన్ అభివృద్ధికి సహకరించే వారికి మద్దతిస్తామని చెబుతున్నారు.

మంత్రి సూచనలు పాటిస్తాం

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి మాట ప్రకారమే మేము నడుచుకుంటాం. మంత్రి మాకు రాజకీయ అవకాశం కల్పించి మేయర్ పీఠాన్ని అప్పగించారు. ఇప్పటి వరకు ఏ కార్పొరేటర్‌నూ మేము అవమానించలేదు. ఏరోజూ మా నాన్న కౌన్సిల్ సమావేశానికి రాలేదు. కేవలం పార్టీ సమావేశాలకు మాత్రమే హాజరవుతారు. కార్పొరేషన్‌లో జరిగే విషయాల్లో ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు. అసలు అవిశ్వాసమే లేదు అని తెలిసినా కావాలని కొందరు కార్పొరేటర్లకు ఆశలు చూపించి ఇబ్బందులకు గురిచేయడం సబబుకాదు. ఎవరెన్ని కుట్రలు పన్నినా జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం.

– మేయర్ కావ్య